# వెలగల గోపాలంగారి చిట్టిరెడ్డి

కాఫీహోటేలు గోపాల్రావుకీ, సారాకొట్టు కుందయ్యకీ కిళ్ళీకొట్టు సుందరయ్యకీ చాలా బాకీ పడిపోయేడు చిట్టిరెడ్డి. వాళ్ళ నాన్న వెలగల గోపాలంగారికి చెపితే అసలుకి చెడద్దనుకున్న ఆళ్ళంతా ఇంట్లో ముసలోడు లేని సందు జూసుకుని చిట్టిరెడ్డి వాళ్ళమ్మ సుబ్బయ్యమ్మగారి దగ్గరకెళ్ళి ఒకోడికీ ఎంతెంత బాకీ ఉన్నాడో చీటి రాసిచ్చేరు.

కళ్ళమ్మట నీళ్ళెట్టుకున్న సుబ్బయ్యమ్మగారు ''ఆళ్ళ నాన్నకి తెలీనీయ్యకండి బాబా'' అని తన కాసులపేరు ఇచ్చేసి అందరిఅప్పులూ తీర్చేసింది.

వయ్యారం వీర్రెడ్డి ద్వారా గోపాలంగారికి తెల్సిపోయింది. ఇక చూస్కోవాలి... వెలగల గోపాలం కేకలకి దొడ్డిగోడ దూకి పారిపోయిన చిట్టి వయ్యారం వీర్రెడ్డిని చితకబాదేసేడు. ఇదికూడా గోపాలానికి తెల్సిపోడంతో మండువా లోగిలంతా గోలగోలగా తయారైంది.

* * *

సింగిశెట్టి రావులుకూతురు మంగ నడుస్తుంటే బేక్‌ఫోజులో ప్రేమనగర్ సినేమాలో వాణిశ్రీలాగుంటదనుకుంటారు వూళ్ళో కుర్రకారంతా.

ఆముక్క మంగచెవిలో పడింది. దాంతో తెగ సంబరపడిపోయిన మంగ నల్లజాకెట్టు ముక్కట్టుకుని చింతా అప్పయ్య పెద్దమ్మగారి అరుగుమీద మిషనుకుట్టే లక్ష్మణరావు దగ్గరకెళ్ళి ప్రేమనగర్ వాణిశ్రీ జాకెట్టులాగ మోచేతులు దిగే మోల్డు కుట్టమంది.

రామచంద్రపురం రాజుగారి హాల్లో సినేమా మారింది.

ఆ జాకెట్టేసుకుని నడుచుకుంటా మొదటాటకి బయల్దేరింది.

వెళ్తన్న మంగని చూసిన కుర్రకారు ''అయ్యబాబోయ్... ఇదేంటి అచ్చంగా  వాణిశ్రీ మనూళ్ళో కొచ్చేసినట్టుంది?'' అనేసుకుని ఆ పిల్ల వెనకాలే సినేమాకి బయల్దేరిపోయేరు.

హాల్లో మంగ ఎనక సీట్లలో కూర్చున్న కుర్రకారు దాని తల్లోపెట్టుకున్న మల్లెపూలు వాసన చూడ్డానికి ట్రైలేస్తుంటే విసిరికొడతుంది వాళ్ళని. కాస్త దగ్గర్లోనే కూర్చుని ఆతంతు చూస్తున్న చిట్టిరెడ్డి మనసు మంగమీదికి పోయింది.

మర్నాటినించీ పేకాటాగీకాటా పక్కన పెట్టి మంగ ఇంటి చుట్టూరా తిరగడం మొదలెట్టేడు.


అలాగ నెలరోజులు కష్టపడ్డాడు.

ఊళ్ళో ఏకుర్రోడు అడిగినా పోరా ఎదవా అని కసిరిన మంగ చింతలూరుతీర్థంలో చిట్టిరెడ్డికి దగ్గరగా వచ్చేసింది.

పేకాటలూ కుర్రోళ్లతో స్నేహాలూ, మందులూ మాకులూ కట్టేసిన చిట్టి ఎప్పుడు పొద్దోద్దా ఎప్పుడు మంగ దగ్గర కెళ్దావా అన కాసుకునుండేవాడు. బాగా రాత్రయ్యేకా అంతకుముందే మంగా తనూ అనుకున్న లాకుల దగ్గరకో, స్మశానాల అవతల వాళ్ళ పాకలోకో, రామచంద్రపురానికీ పసలపూడి మధ్యనున్న పొలాల్లోకో వెళ్ళేవారు.

ఒకరోజు రాత్రి మంగ మావయ్య పోతురాజుగాడికి దొరికిపోడంతో చిట్టిరెడ్డిని నారింజచెట్టుకి కట్టేసి గోపాలంగారికి కబురెట్టేడు.

వచ్చిన గోపాలం తప్పుకట్టి చిట్టిని విడిపించుకుని ఇంటికి తీసుకొచ్చి కొరడాతో బాదుతా బండబూతులు తిట్టేడు.



నాల్రోజులు బాగానే ఉన్నాడు చిట్టిరెడ్డి తర్వాత మామూలే. మంగని వదల్లేక రోజూ వెళ్తానే ఉన్నాడు. సుబ్బయ్యమ్మగారికి తెల్సిపోయింది. అసలే బీ.పీ. సుగరూ ఉన్న సుబ్బయమ్మగారు బెంగెట్టుకుని ఇక మందులేసుకోడం మానేసింది.

దాంతో ఆవిడికి ప్రాణాలు మీద కొచ్చినియ్యి. శేషగిరిరావుగారి హాస్పిటల్లో చేర్చేరు.

సెలైనెక్కిస్తానంటే ఒద్దంటుంది. బిళ్ళలు మింగమంటే ఊసేస్తుంది.

''ఇలాగైతే ఎలాగండీ?'' అన్నాడు డాక్టరుగారు.

ఆవిడ దగ్గర కొచ్చిన గోపాలంగారు ''ఏంటిదీ?'' అన్నారు.


చిట్టిరెడ్డిని పిలిచిన సుబ్బయ్యమ్మగారు ''అసలు దాని ఊసెత్తను అంటే అరుకు మింగుతాను'' అంది.

ఆలోచించిన చిట్టి ''సరే'' అని ఒట్టేసేడు.

* * *

గండేపల్లి అవతలున్న పల్లెటూళ్ళో ఎవరో ఆడించలేక మూసేసిన టూరింగ్ టాకీసు లీజుకి తీసుకున్న చిట్టిరెడ్డి, సుబ్బయ్యమ్మ దగ్గరకొచ్చి ''బుద్ధిగా యాపారం జేసుకుంటానే... నాన్నకి కొంచెం చెప్పి డబ్బు ఇప్పించు'' అన్నాడు.

గోపాలంగారికి చెప్పింది సుబ్బయ్యమ్మ.



నాకు నమ్మకం లేదన్నాడు గోపాలం.

ఆయన్తో గొడవపడీ గోల చేసి చివరికి ఒప్పించింది.

కుతుకులూళ్ళో నల్లమిల్లి అమ్మిరెడ్డి దగ్గరకెళ్ళిన వెలగల గోపాలం నోటు రాసి తెచ్చిన డబ్బు చిట్టి చేతికిచ్చేడు.

ఆ సినేమాహాలు బాగు చేయించి ఫస్టుక్లాసుగా తయారుచేసిన చిట్టి ఎన్టీవోడి బొమ్మ తెచ్చేసేడు.

బ్రహ్మాండంగా లాగుతుంది బొమ్మ.

మూడోకంటోడికి తెలీకండా మంగని తీసుకొచ్చి హాలు వెనక కట్టించిన గదిలో పెట్టేడు.

ఆర్నెల్లయ్యింది.

చాలా బాగుంది సినేమాహాలు వ్యాపారం.

ఎవరో చెప్పేరు ''రిలీజుబొమ్మ ఎయ్యండి. బాగుంటే ఒక దెబ్బకి లక్షలు కళ్ళ జూడొచ్చు అని. అదే విషయం ఆలోచిస్తుండగా ఇంకో ఇద్దరు ముగ్గురు చెప్పేరు అదేముక్క. జాక్‌పాట్‌గానీ కొడితే డబ్బంతా మీదే'' అని. దాంతో బోల్డు డబ్బుకట్టి కొత్తగా రిలీజవుతున్న పెద్ద హీరో బొమ్మ పట్టు కొచ్చేడు.

ఆ బొమ్మ దెబ్బకొట్టింది. పెద్ద సెంటర్లలోనే మొదటివారం లేపేసేరు.

చాలా లాసొచ్చింది చిట్టిరెడ్డికి. కవరవ్వాలంటే ఇంకో రిలీజు బొమ్మ తెచ్చి తీరాలి. అది ఆడితే ఆ డబ్బుతో బకాయిలు కట్టాలి. ఇంకో బొమ్మ తెచ్చేడు. అదీ తేడా చేసింది. దాన్ని తర్వాత ఇంకోటి మూడోదయితే వచ్చిన రోజే ఎగిరిపోయింది.

మంగని పసలపూడి పంపేసిన చిట్టిరెడ్డి రాత్రికి రాత్రే ఎక్కడికో పారిపోయేడు.

అప్పులోళ్ళంతా పసలపూడి వచ్చేసి వెలగలగోపాలంగారి పీకల మీద కూర్చున్నారు. దాంతో, కొంత పొలం అమ్మేసి వాళ్ళ అప్పులూ కుతుకులూరోళ్ళ అప్పులూ తీర్చేడు గోపాలంగారు.

పొలం అమ్మిన గోపాలంగార్ని ఊళ్ళో వాళ్ళంతా చిన్నచూపు చూస్తున్నారు. ఆయనలో మనియాద చూసి తట్టుకోలేకపోయిన సుబ్బయ్యమ్మగారు మంచమెక్కింది.

* * *

ఆర్నెల్లతర్వాత ఊళ్ళోకొచ్చిన చిట్టిరెడ్డి మేస్త్రి వీరాస్వామిగారింటవతల ఇల్లు అద్దెకి తీసుకుని ఎరువుల కొట్టు పెట్టేడు.

ఏ రిస్కూ లేని పని. అందరూ చిట్టిరెడ్డి పిండికొట్లోనే కొంటున్నారు. చాలా బాగా నడుస్తుంది వ్యాపారం. వైజాగులో ఉన్న కోరమాండల్ కంపెనీవాళ్ళు, మెడ్రాసు స్పిక్ కంపెనీవాళ్ళు అరువులు ఇస్తున్నారు. ఇటు పక్కన వ్యాపారం బాగా పెంచాలన్న అయిడియాతో రైతులకి అరువులు ఇవ్వడం కూడా మొదలెట్టేడు. దాంతో ఎప్పుడు చూసినా ఒకటే జనం. అంతా పిండికొట్టు రెడ్డిగారని పిలుస్తున్నారు చిట్టిరెడ్డిని. గోపాళంగారు కూడా అప్పుడప్పుడూ వచ్చి కొట్లోకూర్చుని వెళ్తున్నాడు.

ఇదిలాగుండగా సందలడేసరికి కాకినాడలో వున్న వ్యవసాయ శాఖ జె.డి. గారు రమ్మని కబురెట్టేరని, మెడ్రాసునించి స్పిక్ కంపెనీ

మనుషులు రాజమండ్రిలో దిగేరనీ ఇంట్లో చెప్పి మంగ ఇంట్లో దూరిపోతున్నాడు చిట్టిరెడ్డి.

ఆ ఏడాది పంటలు బాగా దెబ్బతిన్నాయి. దాంతో అరువులు తీసుకున్న రైతులు బాకీలు ఎగ్గొట్టేసేరు.

ఇటుపక్క జూస్తే అరువులు పంపుతున్న కంపెనీలకి డి.డి. లు పంపడం కష్టమైపోతుంది. ఒత్తిడి పెరిగిపోతుంది. పోలీసుకేసులూ, గుక్క తిప్పుకోలేకపోతున్నాడు. వ్యాపారం పూర్తిగా దెబ్బతినేసింది.

అదంతా చూస్తున్న గోపాళంగారు మరో కొంత భూమి అమ్మేసి ఆ కంపెనీలకి కట్టాల్సిన సొమ్ము కట్టేసి పిండికొట్టు మూయించేసేడు.

మంచాన పడున్న సుబ్బయ్యమ్మగారి బెంగ బాగా పెరిగిపోడంతో ఓ తెల్లవారు ఝామున కాలం చేసేసిందావిడ.

* * *

మంగతో చిట్టిరెడ్డి లవ్‌స్టోరీ నడుస్తానే ఉంది.

రామచంద్రపురం మెయిన్‌రోడ్డులో చిట్టూరి జగపతి రామయ్యగారింటి పక్కనిల్లు అద్దెకి తీసుకున్న చిట్టిరెడ్డి మళ్ళీ కొంత అప్పు జేసి ఆ బిల్డింగు డెకరేషన్ చేయించేడు.

నెల్లూరు, తెనాలీ, గుంటూరు నించి మంచి వంటోళ్ళని పిలిపించి ఒక మిలట్రీ హొటలు పెట్టేడు. వంటిల్లు అని దానికి వెరయిటీ పేరు పెట్టేడు.

ఉండూరు అవతలున్న కొంకోడులో ఉండే మంగకి వరసకి అన్నయ్య అయిన బుజ్జిని పిలిపించి కేష్ దగ్గర కూర్చోబెట్టేడు.

రెండుపూటలా జనంతో చాలా నిండుగా ఉంటుంది హొటలు. ఎక్కడెక్కడ్నుంచో వస్తున్నారు జనం. కళ్ళముందు కనపడ్తుంది లాభం. మంగకి కడుపొచ్చింది దాంతో మరింత ఆనందంగా ఉన్నాడు చిట్టిరెడ్డి.

వ్యాపారాన్ని బాగా డవలప్ చేస్తున్న బుజ్జిమీద మంచి గురి ఏర్పడిపోయింది చిట్టిరెడ్డికి. దాంతో కేష్ గొడవా వారం వారం కాకినాడెళ్ళి హోల్‌సేల్ కొట్లో హొటలుకి కావాల్సిన సామాన్లు ఖరీదు చేసే పనీ బుజ్జికి అప్పగించేసి ఇంకోగొప్ప వ్యాపారం గురించి ఆలోచించే పన్లో పడిపోయేడు చిట్టిరెడ్డి.

ఇలాగుండగా, ఒకరోజు కాకినాడ గ్రంధి బాబ్జీగారి కొట్లో ఖరీదుకెళ్ళిన బుజ్జి అయిపు లేకుండా పోయేడు. హొటల్లోనే గాకండా మా బావగారిమ్మన్నారంటా ఊళ్ళో పదిలక్షలు అప్పులు చేసి ఆ కేష్‌తో జెండా ఎత్తేసేడు.

చాలా లాసొచ్చేసింది హొటలుకి.

ఆరాత్రి చిట్టిరెడ్డి ఎదురుగుండా కూర్చున్న మంగ "నా వల్ల మీకెక్కడా కల్సిరాలేదు కాబట్టి, మనం విడిపోదాం" అని మర్నాడే కాకినాడెళ్ళి కడుపు తీయించేసుకుని, రాజమండ్రి నించొచ్చిన రెండో పెళ్ళోడ్ని చేసుకుని వెళ్ళిపోయింది.

హొటల్లో కూర్చున్న చిట్టిని పీకేస్తున్నారు అప్పులోళ్ళు. ఇంకో పక్కనించి వెళ్ళిపోయిన మంగ మీద బెంగ. వాళ్ళలో వాళ్ళు గొడవ పడి వంట మేస్టర్లుకూడా వెళ్ళిపోయేరు. ఇలాంటి దశలో ఒకరోజు హొటలు మూసేసి ఎక్కడికో పారిపోయేడు చిట్టిరెడ్డి.

దాంతో అప్పులోళ్ళొచ్చి మళ్ళీ గోపాలం మీద పడేసరికి మరికొంతనేల అమ్మి బాకీలు చుప్తాగా తీర్చేసి రాములోరి గుళ్ళోకెళ్ళి ఆడు నాకొడుకు కాదు. ఈ జన్మలో ఆడ్ని గడప తొక్క నివ్వను అని ఒట్టేసుకున్నాడు వెలగలగోపాలంగారు.

* * *

ఏడేళ్ళు గడిచిపోయినియ్యి. ఒకరోజు పొద్దున్న ఒక కారొచ్చి ఇంటి ముందుకొచ్చి ఆగేసరికి ''ఎవరూ'' అంటా బయటికొచ్చేడు గోపాలం.

''నేను నాన్నా... చిట్టిని'' అన్నాడు చిట్టిరెడ్డి.

మళ్ళీ ఎందుకొచ్చేవన్నాడు గోపాలంగారు.

నిన్ను తీసుకెళ్ళడానికన్నాడు చిట్టిరెడ్డి.

ఇద్దరి మధ్యలోను చాలా పెద్దవాదనే జరిగింది. ''కడకి చూద్దాం ఈడు తీసుకెళ్ళేచోట ఏం జరుగుద్దో'' అనుకుని చిట్టిరెడ్డికూడా బయల్దేరేడు గోపాలంగారు.

కారు పసలపూడి ఊరి శివార్లు దాటినప్పటినించీ 'శ్రీ' వ్యవసాయం గురించి చెప్పడం మొదలెట్టేడు చిట్టిరెడ్డి. 'శ్రీ' పద్ధతిలో వరిని నీళ్ళకంటే ఎక్కువగా గాలిని ఉపయోగించి పండిస్తారట. ఎకరానికి ముప్ఫైకేజీల విత్తనం అవసరం అయితే 'శ్రీ' పద్ధతిలో కేవలం రెండుకేజీల విత్తనం చాలట. ఇంకా అరిటిడొప్పలో నారు పెంచడం గురించి, ఇరవై అయిదు సెం.మీ. లకు ఒక గుత్తు ఏర్పాటు చేసుకుని చేను మీద లాక్కుని గుర్తులున్న చోట ఒకే ఒకమొక్కను నాటడం గురించీ, చేల మధ్యలో రోటరీ వీడర్ దున్నడం (పొడినేల) గురించీ, అవసరమైనప్పుడు నీరు పాకించడం గురించీ, రసాయనిక ఎరువులూ, పురుగుమందులు వాడకపోవడం గురించీ, తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ పంట పండించడం గురించీ, నాటడానికి తప్పితే మిగిలిన అన్ని విషయాల్లోనూ ఒక మనిషే వ్యవసాయం చెయ్యవచ్చని చిట్టిరెడ్డి చెప్పుకుపోతుంటే మళ్ళీ కొంప ముంచడానికి ఈడేదో కొత్తవతారం ఎత్తేడు అన్న డౌటొచ్చింది గోపాలంగారికి.

ఒక పగలూ, ఒకరాత్రీ గడిచింది. ఎక్కడా సందివ్వకుండా దారి పొడుక్కీ 'శ్రీ' వ్యవసాయం గురించి చెప్పుతానే ఉన్నాడు చిట్టిరెడ్డి.

కారు కర్ణాటక రాష్ట్రంలో కొచ్చింది. తండ్రిని ఇంటికి తీసుకెళ్ళకండా సరాసరి పొలం తీసుకెళ్ళిన చిట్టిరెడ్డి పాలేళ్ళని పిల్చి ''ఆ ధాన్యం రాశి మీద గడ్డి తీయండ్రా'' అన్నాడు.

పది మంది పాలేళ్ళు కల్సి ఒకేసారి ఆగడ్డంతా తీసేశారు.

కొండంత ఎత్తున్న ధాన్యం రాశి అది. రెప్పార్పకండా చూస్తుండిపోయాడు వెలగలగోపాలం.

''నన్ను ఎందుకూ పనికిరాని ఎదవకింద తీసిపారేసేవోడివి గదా 'శ్రీ' పద్ధతిలో నేను పండించిన ఏభై ఎకరాల పంట నీకోసారి చూపిందావని నిన్నింత దూరం తీసుకొచ్చేను నాన్నా. ఈ పంటంతా మనదే నాన్న, ఏభై ఎకరాల భూమి మనదే నాన్నా'' అన్నాడు చిట్టిరెడ్డి.

నెమ్మదిగా ఆ ధాన్యంరాశి పైకెక్కుతున్న వెలగలగోపాలానికి బంగారపు రాశిలో కూరుకుపోయి నడుస్తున్నట్టుంది. మా చిట్టిగాడు పండించేడా ఈ పంటంతా. మా చిట్టిగాడు ఇంత ప్రయోజకుడయ్యాడా..ఎప్పటికప్పుడు మాకో సమస్య అయిపోయిన మా చిట్టిగాడు ఇంత ప్రయోజకుడయ్యేడా ఇది కలా నిజమా. నిజమా అబద్ధమా. సందేహం లేదు నిజమే మా చిట్టిగాడు... మా చిట్టిగాడు మారిపోయేడు. మా చిట్టిగాడు గొప్పోడయిపోయేడు. ఆనందంలో ఉక్కిరిబిక్కిరయిపోయిన వెలగలగోపాళంగారు ఆ ఎత్తయిన ధాన్యం రాశిమీదే పరమానందంతో ప్రాణాలు వదిలేసేడు.

* * *